ఉద్యాన పంటలకు ఊతం

- ఉపాధి పథకం ద్వారా ఆర్థిక సాయం
- సర్కారు పెట్టుబడితో రైతులకు లాభాల పంట
- వేతనదారులకు పనుల కల్పనతో పాటు రైతులకు తోడ్పాటు



తోటలు వేసేందుకు భూమిని సిద్ధంచేసే పనిలో నిమగ్నమైన వేతనదారులు

పాలకొండ రూరల్: ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలకు తోడ్పాటు అందించడంతో పాటు వేతనదారులకు స్థానికంగా పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. ఔత్సాహిక రైతులకు శత శాతం రాయితీపై వివిధ రకాల ఉద్యానవన తోటలు సాగు చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. వాణిజ్య, ఆహార, కూరగాయల పంటలు పండిస్తూ జీవనం గడుపుతున్న రైతులు ప్రభుత్వం ఇస్తున్న పూర్తి సబ్సిడీని వినియోగించుకుంటూ మునగ, నిమ్మ, తదితర తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతుల ఆసక్తి మేరకు నిరంతర ఆదాయం పొందేలా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం సహకారం అందిస్తోంది. జిల్లాలో ఉద్యానవన పంటలు దాదాపుగా లక్షా పది వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో జీడి మామిడి 68 వేల ఎకరాల్లో.. పామాయిల్ 17 వేల ఎకరాల్లో... అరటి 12 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా.. మిగిలిన భూమిలో నేల పనస, మామిడి, పనస, ఇతర పంటలు సేద్యం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 3 వేల ఎకరాలోల 3,500 మంది రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా తోడ్పాటు అందించేలా సంబంధిత యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. జిల్లా పరిధిలోని 15 మండలాల్లో జాబ్‌కార్డు పొందిన లక్షా 42 వేల పైచిలుకు జాబ్‌కార్డు వేతనదారులకు పనులు కల్పించడంతో పాటు నిబంధనల మేరకు సగటున రోజుకు 275 రూపాయలకు పైబడి వేతనం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఉద్యాన పంటలకు సబ్సిడీ....

మామిడి, సపోటా, జామ, జీడి మామిడి, బత్తాయి, నిమ్మ, తైవాన్ జామ, సపోటా, కొబ్బరి,సీతాఫలం, దానిమ్మ, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, మునగ, గులాబీ, మల్లె తోటలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. నేల స్వభావానికి అనుగుణంగా రైతులు ఏ పండ్ల తోటలు వేసుకోవాలో ఉద్యానవన శాఖ అధికారులు చెబుతూ, సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు అందిస్తారు.

వినియోగించుకోండి..



ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న ప్రోత్సాహన్ని రైతులు వినియోగించుకోవాలి. పెట్టుబడి మొత్తం ప్రభుత్వం చెల్లిస్తున్న క్రమంలో వచ్చిన దిగుబడి అంతా రైతులకు లాభమే. ఉద్యానవన పంటల సాగుపై ఆసక్తిగల చిన్న, సన్నకారు రైతులు (ఐదెకరాల్లోపు భూమి ఉన్నవారు) మండల ఉపాధి కార్యాలయం లేదా సచివాలయాల్లో సంప్రదించాలి. నిబంధనల మేరకు రైతులు తమ అర్హతలు తెలియజేయాల్సి ఉంటుంది. అధికారుల పరిశీలన అనంతరం అవసరమగు సేవలు డ్వామా నేతృత్వంలో అందిస్తాం.

– కె.రామచంద్రరావు,
డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం

పథకం మంజూరైతే...

ఉపాధి హామీ పథకం మంజూరైతే నర్సరీల నుంచి మొక్కలు తెచ్చుకోవడం, దుక్కులు మొదలు గుంతలు తీసి మొక్కలు నాటడం, కలుపుతీయడం, ఎరువులు, పురుగు మందులు, నీటి సదుపాయానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. చేయాల్సిన పనులను ఉపాధి వేతనదారులతో చేయిస్తారు. మిగిలిన ఖర్చులకు సంబంధించి రైతు బ్యాంక్ ఖాతాకు నిధులు జమ చేస్తారు. పంట స్వభావం బట్టి ఆరు నెలల నుంచి మూడేళ్లలో ఫలసాయం చేతికొస్తుంది. ఆయా పంటలను దిగుబడి, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఏడాదికి రూ. లక్ష నుంచి మూడు లక్షల రూపాయల వరకు చేతి కందే అవకాశం ఉంటుంది.

మునగకు అధిక ప్రాధాన్యం

అనేక ఔషధ గుణాలు కలిగిన మునగ తోటల పెంపకానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎకరాకు ఏడాదికి రూ.35 వేల వంతున రెండేళ్ల పాటు రూ.70 వేలు రాయితీ వర్తిస్తుంది. పండిన పంట రైతుకు అదనపు ఆదాయంగా ఉంటుంది. మునగలో ఉన్న ఆహార ఔషధాలు ప్రతి వ్యక్తికీ అందాలని డ్వామా ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ రెండు మునగ మొక్కలు గతేడాది పంపిణీ చేశారు. మునగలో అపారమైన పొటాషియం, కాల్షియం, ప్రొటీన్లు, జింకు, ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయి. గుండె,క్యాన్సర్ మధుమేహం, తదితర వ్యాధుల నివారణకు దివ్య ఔషధంగా పని చేస్తుంది.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

వీరఘట్టం: అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలు సక్రమంగా నిర్వహించాలని సీడీపీఓ బి.సిమ్మాలమ్మ సూచించారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. అలాగే స్టాకు వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



నీతికథలు వివరిస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు జనార్ధనరావు

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్ధనరావు అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు వివరించారు. కథలో పాత్రలు, వాటి విలువలు, కథలో తెలుసుకున్న నీతి సమాజంలో ఎటువంటి ప్రభావం చూపుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బబ్బూరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై డీఐవో ఆరా

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్)ను డీఐవో(జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి) ఎం.నారాయణ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన.. అక్కడి చిన్నారుల ఆరోగ్యం, వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను గమనించాలని తెలిపారు. వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని, ఇమ్యునైజేషన్ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

దోమలను నివారించాలి..



అట్టలిలో మలాథియాన్ పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

పాలకొండ రూరల్: అనేక వ్యాధులకు కారణమయ్యే దోమలను నివారించాలని ఎం. సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శంకర్ అన్నారు. మండలంలోని అట్టలి, వాటపాగు, తదితర గ్రామాల్లో సిబ్బందితో కలిసి పర్యటించి, దోమల నివారణ మందు పిచికారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సహకారం అందించాలని కోరారు. పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు తాగు నీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి..

- డాక్టర్ కమల్‌నాథ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్యాధికారి

పాలకొండ రూరల్: రానున్న వర్షాకాల సీజన్‌లో ప్రబలనున్న వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి. కమల్‌నాథ్ అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. అతిసార, వైరల్ జ్వరాల నియంత్రణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో జగదీష్‌కుమార్, ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ తెలిపారు. స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగ విజయోత్సవం గురువారం నిర్వహించారు. ఇదే కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి, క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందిన 10 మందికి ఎంపీడీవో చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. చెన్నైలోని హెచ్ఎల్ మేండోలో నలుగురికి, విశాఖపట్నంలోని హెచ్ఎంఐలో ఇద్దరికి, హైదరాబాద్‌లోని సిరి పవర్ సిస్టంలో నలుగురికి ఉద్యోగాలు వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు. సత్వరమే ఉద్యోగాలు సాధించేందుకు పాలిటెక్నిక్ విద్య ఒక్కటే సరైన మార్గమని, విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీడీవో, ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్, అధ్యాపకులు ఢిల్లేశ్వరరావు, లోకేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు

- డీఎస్పీ కృష్ణారావు



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ : జూన్ 4న ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా ఎవ్వరు కవ్వింపు చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవని డీఎస్పీ జీవీ కృష్ణారావు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 13న ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు బాగా సహకరించారని, అదేవిధంగా లెక్కింపు వరకు కూడా సంయమనం పాటించాలని సూచించారు. ఎన్నికల ఫలితాలపై బెట్టింగులకు పాల్పడవద్దన్నారు. జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత గెలిచిన అభ్యర్థులు ఎటువంటి ర్యాలీలు నిర్వహించకూడదని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

వీరఘట్టం: మండలంలోని కత్తులకవిటి, యు.వెంకమ్మపేట, విక్రమపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు పూటలా పని చేస్తేనే గరిష్ఠ వేతనం 250 రూపాయలు వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే చాలా మంది వేతనదారులు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని.. దీనివల్ల వేతనం గిట్టుబాటు కాదన్నారు. అనంతరం వేతనదారులకు సంబంధించిన మస్తర్లను పరిశీలించారు.

ఆకట్టుకున్న సాయినామ సంకీర్తన

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని, గురువారం చేపట్టిన అఖండ సాయినామ సంకీర్తన ఆకట్టుకుంది. తొలుత సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు చేసిన అనంతరం సాయినామ సంకీర్తనలు ఆలపించారు. శుక్రవారం శ్రీసాయి అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చనలు జూన్ 1వ తేదీన లక్ష పుష్పార్చన, 2వ తేదీన సుదర్శన హోమం, 3వ తేదీన రుద్రాభిషేకం, 4, 5వ తేదీల్లో వార్షికోత్సవ పూజలు, 6వ తేదీన మూలవిరాట్‌కు క్షీరాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు గ్రామంలో భిక్షాటన యాత్ర ఉంటుందన్నారు. జూన్ 6వ తేదీన ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ వైపే ప్రజాతీర్పు



నిమ్మక గోపాల్

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ వైపే ప్రజాతీర్పు ఉందని, జూన్ 4వ తేదీన విడుదలయ్యే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పార్టీ విజయం సాధించడం ఖాయమని పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నిమ్మక గోపాల్ అన్నారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడిన ఆయన.. 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేకానేక సంక్షేమ పథకాలు అమలు చేసి, ఎంతోమంది పేదలను తలెత్తుకుని జీవించేలా చేశారన్నారు. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు నెలకొల్పారన్నారు. అలాగే సామాజిక న్యాయం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారం కల్పించారన్నారు. ఈ ఐదేళ్లలో సువర్ణపాలన అందించిన జగనన్ననే ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ఓటు వేశారని, జూన్ 9వ తేదీన ముఖ్యమంత్రిగా జగనన్న ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా ఉండాలని, ఆ దిశగా వంటల నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు బి.చంద్రశేఖర్, బి.జనార్ధననాయుడు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని 172 పాఠశాలల మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులతో గురువారం సమావేశమైన వారు.. ప్రముఖ తాజ్ హోటల్ చెఫ్(వంట మాస్టర్)లు చేసే వంటకాల వీడియోలను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, వంటకాల తయారీలో తాజ్ హోటల్ వంట మాస్టర్‌లు అనుసరించే విధానాలపై ప్రభుత్వం శిక్షణకు పిలుపునిచ్చిందని, ఈ శిక్షణకు హాజరై, వంటకాలు బాగా వండడంపై నైపుణ్యం సాధించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభమైన తర్వాత ప్రతీ పాఠశాలను సందర్శించి, వంటకాలు రుచి చూసి పరిశీలిస్తామని, ఎక్కడైనా వంటకాలు బాగా లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంఓ జగన్ మోహనరావు



రోగులు, వైద్యసిబ్బందితో మట్లాడుతున్న డీఎంఓ జగన్ మోహనరావు

సీతంపేట: మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి టి. జగన్ మోహనరావు అన్నారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. జ్వరపీడితుల్లో మలేరియా పాజిటివ్ లక్షణాలున్న వ్యక్తులతో మాట్లాడుతూ, వైద్య సేవలు అందుతున్న వైనంపై ఆరా తీశారు. ఎన్ని మలేరియా కేసులు ఉన్నాయో రికార్డులు పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. అనంతరం ల్యాబ్ తనిఖీ చేశారు. ప్రతిరోజూ నిర్వహిస్తున్న జ్వరనిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలపై అడిగి తెలుసుకున్నారు. రోజువారీ నివేదికలను ఎప్పటికప్పుడు జిల్లా మలేరియా నివారణా కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఏ ప్రాంతంలో జ్వరాలు ప్రబలయో తెలుసుకుని సంబంధిత వైద్యాధికారులను క్షేత్రస్థాయికి పంపించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కుశిమి పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్, ఏఎంఓ సూర్యనారాయణ, కన్సల్టెంట్ శ్రీకాంత్, సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి

వీరఘట్టం: దైనందన జీవితంలో ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ అన్నారు. గురువారం స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఆధ్యాత్మిక జ్ఞానసభలో ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ బాధ్యతలు మరిచిపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు మెరుగైన సమాజం ఏర్పడుతుందని చెప్పారు.

ఎంపికైన విద్యార్థుల జాబితాలు సిద్ధం

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్, కాలేజీలో ప్రవేశాలకు సంబంధించి ఎంపికైన వారి జాబితాలు సిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ ఆర్. శివ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాలు పొందిన వారి జాబితా మోడల్ స్కూల్ నోటీస్‌బోర్డులో ప్రచురించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రథమ ఇంటర్ ప్రవేశాలకు సంబంధించిన జాబితాను రిజర్వేషన్ల ప్రకారం తయారు చేసి ప్రదర్శించామన్నారు. జాబితాలో పేర్లున్న విద్యార్థులు జూన్ 1న ధ్రువపత్రాలతో సహా స్కూల్‌లో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 94403 22964 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

పాలకొండ రూరల్: బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సీడీపీఓ బి. సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని ఎం .సింగుపురంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలతో కలసి గురువారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కిశోరీ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు పాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదురైతే తక్షణమే వైద్యసేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పి.దశారత్నం, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సిద్ధంకండి

వీరఘట్టం: ఎన్నికల కౌంటింగ్‌కు ఆర్డర్లు వచ్చిన అధికారులంతా సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ కె.జయప్రకాష్ సూచించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్డర్లు అందుకున్న అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పితృ వియోగం

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కాగితాపల్లి కృష్ణారావు తండ్రి రామ్మూర్తి (85) బుధవారం రాత్రి మృతి చెందారు. రెండు రోజులుగా జరుగుతున్న అమ్మవారి సంబరాల్లో చురుగ్గా పాల్గొన్న రామ్మూర్తి మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాలేరు సర్పంచ్ జామి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట సింహాచలం, కొత్తకోట చంద్రశేఖర్, మేడిబోయిన చలపతి, కొత్తకోట ఆంజనేయులు, తదితరులు గ్రామానికి చేరుకుని కృష్ణారావును ఓదార్చారు. మృతుడికి భార్య నర్సమ్మ, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గరుగుబిల్లి: ప్రతీ మహిళ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గరుగుబిల్లి, రావివలస అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, పి.అరుణ సూచించారు. వరల్డ్ మెన్స్ట్రువల్ హైజీన్ డే సందర్భంగా మండల కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్యారోగ్య సిబ్బంది కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు.. నెలసరి(రుతుచక్రం/ మెన్సస్) సమయంలో పాటించాల్సిన పరిశుభ్రతా చర్యలు, ఆరోగ్యానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

గరుగుబిల్లి: మండలంలోని సాంబన్నవలస గ్రామంలో పారిశుద్ధ్యంపై గురువారం అవగాహన కల్పించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని, మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో పాటు పూడికతీతలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టి, జ్వరపీడితులను గుర్తించి, ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుమతి తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి, బీవీపురం, చినగుడబ, ఉద్దవోలు, గొట్టివలస గ్రామాల్లో గురువారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు పరిశీలించారు. అనంతరం ఆయన మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కురుపాం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు కె.చంద్రశేఖర్, బి.అనిత తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని దొనక, శివ్వాల, ప్యాలెస్ వీధులతో పాటు శివ్వన్నపేటలోని తాగునీటి ట్యాంకుల్లో గురువారం క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. అలాగే మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి, పూడికతీత పనులు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మితమవుతుందన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించి, ఇంటి ముందు, వెనక, పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు.